క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె (గ్రామీణ బంద్)లో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య కోరారు. సమ్మెకు సంబంధించి బుధవారం తుర్కయంజాల్‌లో నేతలతో కలిసి ఆయన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా లావణ్య


నియామకపత్రం అందుకుంటున్న లావణ్య

మంచాల: జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మంచాల మండలం ఆగాపల్లికి చెందిన దూసరి లావణ్య నియమితులయ్యారు. బుధవారం ఆ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు జయమ్మ.. లావణ్యకు నియామకపత్రం అందజేశారు.కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. లావణ్య మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను వందశాతం నేరవేరుస్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఐ విష్ణువర్ధన్‌రెడ్డికి సన్మానం


సీఐని సత్కరిస్తున్న నాయకులు

మాడ్గుల: మాడ్గుల నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన విష్ణువర్ధన్ రెడ్డిని బుధవారం స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ విష్ణువర్ధన్ రెడ్డిని పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ విష్ణువర్ధన్ రెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూదిని కొండల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాములు, స్థానిక నాయకులు పర్వతాలు, కిరణ్, శేఖర్, నర్సింహ, రాజు తదితరులు ఉన్నారు.

ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌గా బాలకృష్ణ



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎస్.బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేసిన అమరేందర్‌రెడ్డి వారం రోజుల క్రితం దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి కమిషనర్‌గా బాలకృష్ణ చార్జి తీసుకున్నారు. గతంలో ఆయన రంగారెడ్డి జిల్లా మెప్మాలో పనిచేశారు. సిబ్బంది, అధికారులు నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా వసంత



ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ కమిషనర్‌గా వసంత బుధవారం నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆమనగల్లు మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేసిన శ్యాంసుందర్ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి మొదటి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి దాదాపు మూడున్నరేళ్లపాటు శ్యాంసుందర్ సేవలు అందించారు. ప్రస్తుతం జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషర్‌గా పనిచేస్తున్న వసంత ఆమనగల్లు కమిషనర్‌గా బదిలీపై వస్తున్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో వెలసిన శ్రీ అలివేలుమంగాసమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవంలో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, ఫౌండర్ ట్రస్టీ కోట్ల జగన్, స్థానిక నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేటి నుంచి చుక్కాపూర్ చెన్నకేశవస్వామి ఆలయ వేడుకలు
- కోరిన కోర్కెలు నెరవేర్చే స్వామిగా ప్రసిద్ధి
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలిరానున్న భక్తులు



చెన్నకేశవస్వామి ఆలయం, (ఇన్‌సెట్‌లో) రథం

తలకొండపల్లి: తలకొండపల్లి మండలం చుక్కాపూర్‌లోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక్కడ కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాశం. ఈ ఆలయంలో నిద్ర చేసినచో దుష్ట శక్తులను పారద్రోలి, మానసిక ప్రశాంతత కలుగడంతో పాటు ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టాల నుంచి బయట పడతారని భక్తుల విశ్వాశం. ఇంత ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. ప్రతి యేటా ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలువైపుల నుంచి భక్తులు తరలివస్తారని నిర్వాహకులు తెలిపారు. కోర్కెలు తీరిన వారు సత్యనారాయణ వ్రతాలు, తలనీలాలు, పుట్టు వెంట్రుకలు తదితర ముడుపులు సమర్పించి మొక్కు తీర్చుకుంటున్నారు.

హైదరాబాద్‌కు అతి చేరువలో..

హైదరాబాద్ నగరానికి 70 కి.మీ దూరంలో ఆమనగల్లు–శ్రీశైలం ప్రధాన రహదారిలో ఆమనగల్లు నుంచి తలకొండపల్లి వెళ్లే దారిలో చుక్కాపూర్‌కు 9 కి.మీ దూరంలో ఈ చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. ఈ గుడి మొదట చిన్నదిగా ఉండేది. దాతల సహాయంతో ఆలయం అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, కోనేరు, రథశాల, వంటశాల తదితర భవన సముదాయాలను నిర్మించారు.

నేటి నుంచి ఉత్సవాలు...

ఈ ఆలయ బ్రహ్మోత్సవాలను ప్రతి యేట సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి మొక్కురాల వెంకటేశ్వరశర్మ తెలిపారు. 15న ప్రారంభమై 19న బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

ఏర్పాట్లు పూర్తి



ప్రతి ఏటా రథసప్తమిని పురస్కరించుకొని సాంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నాం. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆలయం ఆవరణలో తాగునీరు, చలువ పందిర్లు వంటి ఏర్పాట్లు చేస్తున్నాం.

– వెంకటేశ్వరశర్మ, పూజారి

అభివృద్ధి చేయాలి



బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలలు నుంచి భక్తులు తరలి వస్తుంటారు. కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఈ విషయాన్ని అధికారులతో పాటు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాను.

– యాదయ్య, మాజీ ఎంపీటీసీ, చుక్కాపూర్

కోర్కెలు నెరవేరుతాయి



ఇక్కడ స్వామివారిని దర్శించుకున్న భక్తుల కోరిన కోర్కెలు నెరవేరుతాయి. మహిమలు గల దైవం శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రత్యేకత. ప్రతి యేడాది భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

– కిష్టమ్మ, మాజీ సర్పంచ్, చుక్కాపూర్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవునిపడకల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు జోగు రమేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి తన ఎమ్మెల్యే నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూర్ చేశారని చెప్పారు. మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ రమేష్, నాయకులు.. జగ్గారెడ్డి, భిక్షపతి, శంకర్, రమేష్, నవీన్, పాండు, కృష్ణయ్య, శ్రీను, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ పనులు ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌లో బుధవారం ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూర్ చేశారని.. ఆ నిధులతో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, రాజు, శంకరయ్య, జంగయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ ఎంపీడీఓగా సుజాత



కడ్తాల్: కడ్తాల్ మండల ఎంపీడీఓగా సుజాత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు కడ్తాల్ ఎంపీడీఓగా పనిచేసిన రామకృష్ణ వికారాబాద్ జిల్లాకు బదిలీ కాగా సంగారెడ్డి జిల్లా కోహిర్ ఎంపీడీఓగా పనిచేస్తున్న సుజాత బదిలీపై కడ్తాల్‌కు వచ్చారు. సుజాత మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. నూతన ఎంపీడీఓ సుజాతకు కార్యాలయ సిబ్బంది, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సత్కారం


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆమనగల్లులోని కేడీఆర్ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కేడీఆర్ కళాశాలను 1989లో స్థాపించగా అందులో చదివిన ఇంటర్ మొదటి బ్యాచ్ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లింగంగౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, మహ్మద్ మూసా, లక్ష్మణ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, శంకర్, హరికిషన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎంపీ రాములు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారికు స్థానిక నాయకులు బుధవారం అందజేశారు. ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వారు తెలిపారు. ఉత్సవాలకు తప్పకుండా రావాలని కోరారు. ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, బిక్కునాయక్, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా సునీత



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహసీల్దార్ అన్వర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బుధవారం హయత్‌నగర్ తహసీల్దార్ సునీత ఇక్కడ పదవీ బాధ్యతలు చేపట్టారు. కాగా అసెంబ్లీ ఎన్నికల ముందు నవంబర్ నెలలో అన్వర్ బదలీపై ఇక్కడికి వచ్చారు. ఇంత తొందరగా బదిలీ వేటు పడుతుందని భావించలేదు. ఆయన షాబాద్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

మోదీతోనే దేశ అభివృద్ధి

బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్


కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవీందర్ తదితరులు

యాచారం: ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశ భద్రత, అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి కుర్మిద్ద గ్రామంలో బూత్ స్థాయి కమిటీల సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి మంజూరు చేస్తున్న నిధులు, అభివృద్ధి పనులపై చర్చించారు. మంగళవారం రాత్రి అక్కడే బస చేసి బుధవారం ఉదయం గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటువేసి మూడోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. అనంతరం ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధికార ప్రతినిధి మల్లేశ్, బూత్ అధ్యక్షుడు ప్రవీణ్, శ్రీనువాస్‌గౌడ్, నాయకులు వెంకటేశ్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ కమిషనర్‌గా వాణి



తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా వాణిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తుర్కయంజాల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్.శ్రీకాంత్‌ను పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపాలిటీకి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన గడిచిన 7 నెలలుగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఆయన స్థానంలో మీర్‌పేట కమిషనర్ వాణి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

మెరుగైన వైద్యం అందించండి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ కొప్పు సుకన్య కోరారు. బుధవారం ఆ ఆస్పత్రిని ఎంపీపీ సుకన్య పరిశీలించారు. ఆస్పత్రిలో ఐదేళ్ల లోపు చిన్నారులకు వైద్య సిబ్బంది విటమిన్–ఏ టాబెట్లను వేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. అన్నిరకాల వైద్య పరికరాలను కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. రోగుల కోసం ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్


ఇబ్రహీంపట్నం: కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కేవీపీఎస్, సీఐటీయూ నేతలు కోరారు. అదేరోజున ఆర్టీసీ బస్సులను కూడా బంద్ పెట్టాలని ఇబ్రహీంపట్నం డిపో అధికారులకు బుధవారం వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇబ్రహీం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆర్టీసీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్, సీఐటీయూ సహాయ కార్యదర్శి స్వప్న, కార్మిక నాయకులు.. ఎల్లేశ్, జంగయ్య, ముసలయ్య, చరణ్, దశరథ, ఆనంద్, వంశీ, వినయ్, విఘ్నేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కరపత్రాలతో ప్రచారం..

మంచాల: ఈనెల 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి పోచమోని కృష్ణ పిలుపునిచ్చారు. మంచాల మండల పరిధిలోని లోయపల్లిలో బుధవారం ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను కరపత్రాలు పంచి వివరించారు. వివిధ సంఘాల నాయకులు సుధాకర్, రాజు, కుమార్, సాలమ్మ, పద్మమ్మ, రాములమ్మ, అంజమ్మ, సరోజ, రవి, సత్తయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామ పంచాయతీలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీపీ పర్యటించారు. మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతుందని.. తండాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యం, మాజీ వార్డు సభ్యులు జవహర్‌లాల్, శ్రీను, రాములు, యాదగిరి ఉన్నారు.

'పుల్వామా' అమరులకు నివాళి


నివాళి అర్పిస్తున్న ఎస్‌ఐ బల్‌రాం, విద్యార్థులు

ఆమనగల్లు: పుల్వామా దాడుల్లో అమరులైన జవానులకు ఆమనగల్లు పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం అమరజవాన్ల చిత్రపటాలకు ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాములు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ రక్షణ కోసం భారత సైన్యం అందిస్తున్న సేవలను కొనియాడారు. తీవ్రవాదుల దాడిలో అమరులైన పుల్వామా అమరజవాన్‌లను వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ యాదయ్య, కళాశాల లెక్చరర్లు వెంకటేశ్, కృష్ణయ్య, ఏబీవీపీ నాయకులు శివ, మల్లేశ్, అంజి, మల్లేశ్, శంకర్, సుమన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శిశుమందిర్ పాఠశాలలో ఉదయం ప్రత్యేక పూజలు, యాగం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా బాసర శ్రీ జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలో అర్చన చేయించిన కుంకుమ, ఫోటోలను బహూకరించారు. ఈకార్యక్రమంలో ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం, శిశుమందిర్ పాఠశాల అధ్యక్షులు పాపిశెట్టి రాము, ఉపాధ్యక్షుడు దొంతు సత్యం, కార్యదర్శి ఆనంద్, మాజీ అధ్యక్షులు డా.దొంతు పుల్లయ్య, శిశుమందిర్ పాఠశాల ప్రధానాచార్యులు కవిత, ఉపాధ్యాయులు స్వాతి, అనూష, స్థానిక నాయకులు సాయి, శ్రీశైలం, ప్రవీన్, మహేశ్, శ్రీకాంత్, తిరుపతయ్య, మాధవాచారి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- సాగర్‌రోడ్డుపై ప్రమాదాలను నివారిస్తాం
- అవసరమున్న చోట్ల సీసీ కెమెరాల బిగింపు
- యాచారం సీఐ శంకర్‌కుమార్



యాచారం: యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతలే లక్ష్యంగా నిఘా ఉంటుందని. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని యాచారం నూతన సీఐ ఎస్.శంకర్‌కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా సాగర్ రోడ్డుపై ప్రమాదాల నివారణ కోసం అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు బిగించేలా దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణ, ప్రజల ఫిర్యాదులపై బుధవారం 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వూ ఇచ్చారు.

సాక్షి: శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

సీఐ: యాచారం పోలీస్ స్టేషన్‌పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రతి గ్రామంలో పోలీస్ నిఘా ఉంటుంది. ఏం జరిగినా క్షణాల్లో పోలీసులు చేరుకునేలా, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం

సాక్షి: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగర్ రోడ్డుపై గునుగల్ గ్రామ శివారు నుంచి మాల్ కేంద్రం వరకు రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిఘా పెడతాం. ప్రమాదాలు జరిగే స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. తరుచూ తనిఖీలు నిర్వహిస్తూ వాహనాదారులు అతివేగంగా వెళ్లకుండా కట్టడి చర్యలు తీసుకుంటాం.

సాక్షి: సాగర్ రోడ్డుపై ప్రమాదాలు చేసిన వాహన డ్రైవర్లు తప్పించుకోవడంపై ఏం చర్యలు తీసుకుంటారు?

సీఐ: సాగర్ రోడ్డుపై పలుచోట్ల సీసీ కెమెరాలు బిగిస్తాం. సీసీ కెమెరాలుంటే ప్రమాదం చేసిన వాహనాలను గుర్తుపట్టి బాధితులకు న్యాయం చేయవచ్చు.

సాక్షి: సాగర్‌రోడ్డుపై ఉన్న పెంట్రోల్ పంపులు, ఫంక్షన్ హాళ్ల యజమానులు భద్రతా చర్యలు తీసుకోవడం లేదు కాదా?

సీఐ: ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చింది, వెంటనే ఫంక్షన్ హాళ్ల, పెంట్రోల్ పంపుల యజమానులతో మాట్లాడి సీసీ కెమెరాలు బిగించేలా సూచనలు చేస్తా. పెంట్రోల్ పంపులు, ఫంక్షన్ హాళ్ల నుంచి సడన్‌గా రోడ్డుపైకి రావడం పలు ప్రమాదాలు జరిగి ఎంతో మంది మృతి చెందినట్లు నా దృష్టికి వచ్చింది.

సాక్షి: గ్రామాల్లో బెల్టు దుకాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

సీఐ: గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మద్యం విక్రయాలు జరిపేవారు స్వచ్ఛందంగా బంద్ చేసుకోవాలి. బెల్టు దుకాణాల నిర్వాహకులపై ప్రజలే పోలీసులకు సమాచారం అందించాలి.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

కౌన్సిలర్ సునీల్

తుర్కయంజాల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని పురపాలక సంఘం పరిధి కమ్మగూడ 18వ వార్డు కౌన్సిలర్, పీసీసీ సభ్యులు కాకుమాను సునీల్ తెలిపారు. బుధవారం కమ్మగూడలో గృహజ్యోతి పథకం స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొని ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాములు తదితరులు పాల్గొన్నారు.